www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 15 ఫిబ్రవరి 2023
5
ఏలూరు



బలివే ఉత్సవ ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

ఈనెల 17వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించే బలివే శ్రీరామలింగేశ్వరస్వామి ఉత్సవ ఏర్పాట్లను ఉన్నతాధికారులు మంగళవారం పరిశీలించారు. అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్, ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ దాసరి సుధ, ఇఒపిఆర్‌డి బసవరాజు అచ్యుత సత్యనారాయణ, ఎఇ కూచిపూడి సాయిరామ్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి ఎఇ, ఆలయ ఎఇ టి.విశ్వేశ్వరరావు, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. తమ్మిలేరులో ఇప్పటి వరకూ నీళ్లు రాకపోవడం, రోడ్లు, తదితర ఆంశాలను ఆయా శాఖల అధికారులతో మాట్లాడారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఎంఎల్‌సి ముసలం..!

అధికారపక్షంలో అసంతృప్త జ్వాలలు
ఆది నుంచి కష్టపడిన నేతలకు అధినాయకత్వం ఝలక్
జయమంగళ, కరాటంలకు ఎంఎల్‌సి పదవుల ప్రచారంపై జిల్లా నేతల్లో ఆగ్రహం
పార్టీని దెబ్బతీస్తున్నారంటూ వైసిపి శ్రేణుల విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎంఎల్‌సి పదవుల వ్యవహారం వైసిపిలో ముసలం రేపుతోంది. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడినోళ్లను పక్కనపెట్టి వేరే పార్టీల నేతలకు పదవులు కట్టబెట్టే ఆలోచనపై జిల్లాలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ ఆవిర్భావ సమయంలో అధినాయకుడు చెప్పిన మాటలకు, ప్రస్తుత పరిణామాలకు పొంతన లేకపోవడం పార్టీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. మడమ తిప్పం.. మాట తప్పం అని చెప్పిన నాయకుడు ప్రస్తుతం సొంత పార్టీలో కష్టపడిన నాయకులను పక్కనపెట్టి వేరే పార్టీలో నాయకులను పిలిచి మరీ పదవులు కట్టబెట్టడం ఏమిటనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ నెల 16న స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది. జిల్లాలో రెండు స్థానిక సంస్థల ఎంఎల్‌సి స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక సంస్థలకు ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో అత్యధికం వైసిపికి చెందిన వారే. దీంతో రెండు ఎంఎల్‌సి పదవులు వైసిపికే దక్కనున్నాయి. దీంతో పార్టీలో ఆది నుంచి కష్టపడుతున్న నాయకులంతా ఎంఎల్‌సి పదవులపై ఆశలు పెట్టుకున్నారు. ఒకటి బిసి, రెండో పదవి జనరల్‌కు ఇస్తారనే ప్రచారం సాగింది. ఇప్పటి వరకూ బాగానే ఉంది. ఎంఎల్‌సి పదవులపై వైసిపి అధిష్టానం వ్యవహరిస్తున్న తీరు ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. గత ఎన్నికల్లో కైకలూరులో టిడిపి అభ్యర్థిగా బరిలోకి దిగి ఓటమి పాలైన టిడిపి నాయకుడు జయమంగళ వెంకటరమణకు ఎంఎల్‌సి పదవి ఇవ్వనున్నట్లు ప్రచారం సాగుతోంది. సిఎం జగన్‌ను కలిశాకనే, ఎంఎల్‌సి పదవిపై భరోసా ఇచ్చారని జయమంగళనే చెబుతున్నారు. జయమంగళకు భర్తీగా పెండం దీనికి బలం చేకూరుస్తోంది. దీనిపై వైసిపిలోనూ వడ్డీ సామాజిక తరగతికి చెందిన నేతలున్నారు. వీరు కూడా ఎంఎల్‌సి పదవి ఆశిస్తున్నారు. హఠాత్తుగా టిడిపిలో ఉన్న నేతను పిలిచి పదవి ఇస్తున్నారని వైసిపి నాయకులు, కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. రాత్రీ పగలు పార్టీ కోసం కష్టపడటం ఎందుకని వారంతా ప్రశ్నిస్తున్నారు. జగన్ పార్టీ పెట్టిన సమయంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పదవిని వదిలి వైసిపిలో అడుగులు వేసిన నేతలకు ఇప్పటికీ గుర్తింపు లేకుండా పోయింది. టిడిపి ప్రభుత్వ హయాంలోనూ వీరంతా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొని పార్టీ కోసం కష్టపడ్డారు. అలాంటి నాయకులను వైసిపి అధిష్టానం ఏమాత్రం పట్టించుకోకపోవడం అందరినీ తీవ్రంగా వేధిస్తోంది. దీంతో ఎంఎల్‌సి పదవి ఆశిస్తున్న నేతలంతా పార్టీ అగ్రనేతలను కలిసి గట్టిగానే దీనిపై మాట్లాడినట్లు సమాచారం. కొంతమంది నేతలైతే కళ్లనీళ్లు పెట్టుకున్నట్లు కూడా తెలుస్తోంది. జయమంగళ చేరికతో లాభం సంగతి అటుంచి పెరుగుతున్న అసంతృప్తితో వైసిపికి తీవ్రం నష్టం తప్పదని అభిప్రాయం వైసిపి నేతల్లో వ్యక్తమవుతోంది.

రెండో పదవికి పరిశీలనలో కరాటం రాంబాబు?


జిల్లాలోని రెండు ఎంఎల్‌సి పదవుల్లో ఒకటి టిడిపి నుంచి రానున్న బిసి నేత జయమంగళ వెంకటరమణకు ఇవ్వనున్నట్లు ఇప్పటికే కొంత స్పష్టత వచ్చింది. రెండో ఎంఎల్‌సి పదవి మెట్ట ప్రాంతంలో ఒకప్పుడు కాంగ్రెస్‌లో కీలకంగా వ్యవహరించి డిసిసిబి ఛైర్మన్‌గా పని చేసిన కాపునేత కరాటం రాంబాబుకు ఇవ్వనున్నట్లు పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం కరాటం రాంబాబు కాంగ్రెస్‌లో కూడా చురుగ్గా లేరు. దాదాపు రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. అయినప్పటికీ కాపు కోటాలో కరాటం రాంబాబుకు ఎంఎల్‌సి పదవి ఇవ్వాలని వైసిపి అధిష్టానం చూస్తున్నట్లు సమాచారం. దీనిపై ఇప్పటికే కొంత చర్చ జరిగినట్లు తెలుస్తోంది. కరాటం రాంబాబుకు ఎంఎల్‌సి పదవి ఇవ్వడంపై స్థానిక వైసిపి నేతలు అభ్యంతరం చెబుతున్నట్లు తెలిసింది. రెండో పదవి కరాటం రాంబాబుకు కూడా ఇస్తే పదవి ఆశిస్తున్న నాయకులకు మొండిచెయ్యి చూపించినట్లే. ఏదేమైనా ఎంఎల్‌సి పదవుల వ్యవహారం వైసిపిలో పెద్దఎత్తున ముసలం రేపే పరిస్థితి కన్పిస్తోంది. కాపు కోటాలో గుణ్ణం నాగబాబుకు ఎంఎల్‌సి పదవి ఇవ్వాలని జిల్లాలోని ముఖ్యనేతలు అధినాయకత్వంపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీనిపైనా వైసిపి నేతలు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. కీలక సమయంలో పార్టీని వీడి అధికారంలోకి వచ్చాక మళ్లీ తిరిగొచ్చిన వారికి ఏవిధంగా ఎంఎల్‌సి పదవి కట్టబెడతారనే ప్రశ్నలు ఆ పార్టీ శ్రేణుల నుంచే వెల్లువెత్తుతుండటం గమనార్హం. ఏదేమైనా అభ్యర్థిత్వాలు ఖరారయ్యాక ఎటువంటి పరిణామాలు చోటుచేసుకుంటాయో వేచి చూడాలి.

వైసిపిలో చేరుతున్నా

టిడిపిలో అణగదొక్కారు
కార్యకర్తలతో మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ

ప్రజాశక్తి - కైకలూరు

తెలుగుదేశం పార్టీలో నాయకులు తనను రాజకీయంగా అణగదొక్కారని, అందుకే అవమానాలు భరించలేక వైసిపిలో చేరుతున్నట్లు మాజీ ఎంఎల్ఎ జయమంగళ వెంకటరమణ తెలిపారు. ఆటపాకలోని తన నివాసం వద్ద మంగళవారం ఆయన తన అభిమానులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ రాజకీయాల్లో చంద్రబాబు, దిగువస్థాయి నాయకులు తనను మోసం చేసిన తీరును వివరించారు. టిడిపిలో ఉన్నంత వరకు శక్తి వంచన లేకుండా ఆస్తులు ఖర్చు చేసి పార్టీ కోసం పని చేశానన్నారు. తన వెంట ఉండే నాయకులే తనకు వెన్నుపోటు పొడిచి మానసికంగా ఇబ్బందులకు గురి చేశారన్నారు. తనను నమ్ముకున్న ప్రజలకు మేలు చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించారు. తనకు తల్లిదండ్రులు, భార్య లేరని, తాను సంపాదించిన మొత్తం కూడా పేదల అభివృద్ధి కోసం ఖర్చు చేస్తానని తెలిపారు. తనపై అవినీతి ఆరోపణలు రుజువు చేస్తే ఉరేసుకొని చస్తానని ప్రకటించారు. వైసిపి ఎంఎల్ఎతో కలిసి పని చేసి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. తన నిర్ణయం సరైనదని భావిస్తే తనతో కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీలో 2004 నుంచి తనకు జరిగిన అన్యాయాలను, అవమానాలను వివరించారు. ఈ సందర్భంగా టిడిపి సభ్యత్వానికి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవికి కార్యకర్తల సమక్షంలో రాజీనామా చేశారు. త్వరలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వద్దకు వెళ్లి వైసిపిలో చేరతానని వివరించారు.



మాట్లాడుతున్న జయమంగళ వెంకటరమణ

డ్వాక్రా బజార్ వాయిదా

ప్రజాశక్తి - ఏలూరు

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల దృష్ట్యా ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు ఏలూరు ఇండోర్ స్టేడియంలో నిర్వహించదల్చిన డ్వాక్రా బజార్‌ను వాయిదా వేసినట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా నియమావళి అమలులోకి వచ్చిన దృష్ట్యా డ్వాక్రా బజారు ఏర్పాటును వాయిదా వేశామని, తర్వాత ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

తుమ్మలపల్లి కళాక్షేత్రం పేరు మార్పు సరికాదు

ప్రజాశక్తి - టి.నరసాపురం

తుమ్మలపల్లి కళాక్షేత్రం పేరు మార్చడం ప్రభుత్వ పెద్దల అజ్ఞానానికి నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్.రాజు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజానాట్యమండలి గౌరవ అధ్యక్షులు సబ్బి కనకారావు, సీనియర్ బుర్రకథ కళాకారులు వీరమల్ల సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు. విజయవాడ మహానగరంలోని ప్రముఖ సాంస్కృతిక కేంద్రమైన తుమ్మలపల్లి కళాక్షేత్రం పేరు మార్చేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుమ్మలపల్లి వారి కళాక్షేత్రంగా దశాబ్దాల పాటు సాంస్కృతిక కళా కేంద్రంగా ఎన్నో సాంస్కృతిక సంస్థలు, సాహితీ సంస్థలు, సాహిత్య కళా సామాజిక దృక్పథంతో కూడిన సభలు, సమావేశాలు జరుపుకునే ఈ కళాక్షేత్రాన్ని దాతల పేరు తొలగించి కేవలం కళాక్షేత్రంగా పేరు మార్చాలని ప్రభుత్వ పెద్దలు తీసుకున్న నిర్ణయం కళారంగాన్ని, కళాకారులను, సాహిత్య ప్రియులను అవమానించినట్లేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని పేర్లూ మార్చుకుంటూపోవడం ప్రభుత్వ పెద్దల అజ్ఞానానికి నిదర్శనమని విమర్శించారు. సాంస్కృతి శాఖ ప్రతినిధులు, ఉన్నతాధికారులు పునరాలోచించి తుమ్మలపల్లి కళాక్షేత్రంగా ఉన్న పేరును కొనసాగించాలని కోరారు. ఎపి జానపద కళాకారుల సంఘం నాయకులు, ప్రముఖ కోలాట కళాకారులు బొందలపాటి పద్మావతి, ప్రజానాట్యమండలి ఏలూరు జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు కంకిపాటి బుచ్చిబాబు, కంకిపాటి ఏసుపాదం, ముళ్లగిరి అలెగ్జాండర్, పౌరాణిక రంగస్థలం సభ్యులు తోట లక్ష్మీనారాయణ ఖండించిన వారిలో ఉన్నారు.

మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

గ్రామీణప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు, అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎన్.చంటిబాబు అన్నారు. మంగళవారం ఆగిరిపల్లి పోలీస్‌స్టేషన్‌లో మహిళా పోలీసులకు ఆయన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలు, వృద్ధులు, చిన్నారుల సమస్యలపై మహిళా పోలీసులు దృష్టిసారించాలని, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు, దిశా కాల్స్‌కి తక్షణం హాజరు కావాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని మహిళా పోలీసులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని అధికారులు, సచివాలయ సిబ్బంది మండల అభివృద్ధిపై దృష్టిపెట్టాలని ఎంపిడిఒ కెఎం.మంగతాయారు సూచించారు. మంగళవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశంలో మండల ప్రత్యేక అధికారి పివిఎస్.నాయుడుతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా శాఖల పనితీరుపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి పివిఎస్.నాయుడు, తహశీల్దార్ ఎలీషా, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు పన్ను కట్టకుంటే వంద శాతం పెనాల్టీ

జంగారెడ్డిగూడెం:రోడ్డు పన్ను చెల్లించని వాహనాలపై జరిమానా విధిస్తామని జంగారెడ్డిగూడెం రవాణా శాఖ అధికారి ఎమ్‌డి మదని తెలిపారు. వాహనాలకు తప్పనిసరిగా ట్యాక్స్, ఇన్స్యూరెన్స్, పొల్యూషన్ కచ్చితంగా ఉండాలన్నారు. అలాగే వాహనదారులు హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. ట్యాక్స్ పరిమితి కాలం ముగిసిన వెంటనే రెన్యువల్ చేయించుకోవాలని, లేకుంటే వంద శాతం పెనాల్టీ పెరుగుతూ ఉంటుందని తెలిపారు. వాహన యజమానులు దృష్టిసారించి సకాలంలో పన్ను కట్టాలని సూచించారు.

'జగనాసుర రక్త చరిత్ర' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - నూజివీడు

సిఎం జగన్ ప్రజావ్యతిరేక పాలనకు చరమగీతం పాడి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని నూజివీడు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాజీ శాసనసభ్యులు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో 'జగనాసుర రక్త చరిత్ర' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పుస్తకంలో సిఎం జగన్ ప్రజావ్యతిరేక విధానాలు, ఆయన మంత్రివర్గం, ఎంఎల్‌ఎల అరాచకాలను ముద్రించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు జగ్గవరపు వెంకటరెడ్డి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి టి.రాజశేఖర్, నూజివీడు మండల అధ్యక్షులు ముసునూరు రాజా, కౌన్సిలర్ తిరుమలశెట్టి సాధన లక్ష్మి స్రవంతి, ఏలూరు పార్లమెంట్ తెలుగు మహిళ కమిటీ సభ్యురాలు జి.దుర్గాదేవి, కౌన్సిలర్ యార్లగడ్డ ప్రసాద్, మాజీ కౌన్సిలర్ కందుపల్లి చెన్నారావు, నూజివీడు మండల ప్రధాన కార్యదర్శి గిరిబాబు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఎల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో విఆర్‌ఎలు స్థానిక కలెక్టరేట్ వద్ద మంగళవారం ధర్నా చేపట్టారు. జిల్లా నలుమూలల నుండి పెద్ద సంఖ్యలో విఆర్‌ఎలు హాజరయ్యారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, తగ్గించిన డిఎను యథావిధిగా కొనసాగించాలని, నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలని, జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉండగా విజయవాడలో విఆర్‌ఎల ధర్నా శిబిరానికి విచ్చేసి తాను ముఖ్యమంత్రి అయిన వారం రోజుల్లో మీ వేతనాలు పెంచుతానని, సమస్యలు పరిష్కరిస్తానని ఇచ్చిన వాగ్దానం చేశారని గుర్తు చేశారు. మూడున్నర సంవత్సరాలు గడిచినా ఆ హామీలేవీ అమలు కాలేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ వ్యవస్థలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్న విఆర్‌ఎలు మూడున్నర సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా వేతన పెంపుదల లేకుండా జీవిస్తున్నారన్నారు. తక్షణమే విఆర్‌ఎలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న డ్రైవర్, వాచ్‌మెన్, అటెండర్ పోస్టులను విఆర్‌ఎలతో భర్తీ చేయాలని కోరారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాజీ, కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ విఆర్‌ఎలకు ఏళ్ల తరబడి ఇస్తున్న డిఎను జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిలిపేసిందని విమర్శించారు. ఇస్తున్న డిఎను సైతం ఆపడం దారుణమన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమానికి వల్లీ, కాలేషా, ఆంజనేయులు, ఫకీర్, మీరావలి, నరసన్న, మోహన్‌రావు, రవి తదితరులు నాయకత్వం వహించారు.



ధర్నా చేస్తున్న విఆర్‌ఎలు

రూ.8,660 కోట్లు పంచాయతీ నిధులు అక్రమ మళ్లింపు

ఎపి పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి.రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామ పంచాయతీల నిధులు రూ.8,660 కోట్లు అక్రమంగా మళ్లించారని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవిబి.రాజేంద్రప్రసాద్ అన్నారు. రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీల సర్పంచులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. మంగళవారం స్థానికంగా ఎపి సర్పంచుల సంఘం, పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో మూడు జిల్లాల ముఖ్య నాయకులు సమావేశమై, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీ నిధులను అక్రమంగా రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించి, తన సొంత అవసరాలకు, పథకాలకు వాడేసిందని ఆరోపించారు. రాత్రికి రాత్రే అడ్డగోలుగా నిధులు దారి మళ్లించిందని, ఫలితంగా గ్రామాల్లో కనీస అవసరాలు తీర్చలేని దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల దీనిపై రాష్ట్రవ్యాప్తంగా రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీల సర్పంచులు రోడ్డెక్కినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని తెలిపారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, శానిటేషన్, లైటింగ్ మొదలగు సౌకర్యాలను తమ గ్రామ ప్రజలకు కల్పించడానికి నిధుల్లేక సర్పంచులు ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోయారని ఆరోపిం చారు. తక్షణం పంచాయతీలకు నిధులు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ సలహాదారులు పిల్లి సత్తిరాజు, ఏజెర్ల వినోదరాజు, రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి, బుచ్చిరాజు, పగడాల రమేష్, జిల్లా అధ్యక్షులు కడలి గోపాలరావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అమర్‌జాహ్నబేగం, అన్నవరం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైవిబి.రాజేంద్రప్రసాద్

ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రైతులు పంట నమోదును తప్పనిసరిగా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని వట్టిగుడిపాడు, అనంతసాగరం గ్రామాల్లో పంట నమోదును ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు వ్యవసాయ సహాయ సంచాలకులు జి.విద్యాసాగర్, మండల వ్యవసాయాధికారి పి.చెన్నారావు, వ్యవసాయ విస్తరణాధికారి కె.ధనబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు డి.శ్రావణి, పలువురు రైతులు పాల్గొన్నారు.

ముసునూరు:రైతులు తమ పంటను ఇ-క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని గుళ్లపూడి, లోపూడి, చెక్కపల్లి గ్రామాల్లో మొక్కజొన్న పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇ-క్రాప్ నమోదు వల్ల ప్రయోజనాలను వివరించారు. మండల వ్యవసాయాధికారి సిహెచ్.శ్రీనివాసరావు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు: రైతులు తమ పంటలను ఇ-క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ సూచించారు. మంగళవారం ఇ-క్రాప్ నమోదును ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు ఎడిఎ జి.విద్యాసాగర్, ఆగిరిపల్లి మండలం ఎఒ పల్లగాని చెన్నారావు, గ్రామ వ్యవసాయ సహాయకులు డి.శ్రావణి, రైతులు పాల్గొన్నారు.



ముసునూరు మండలంలో పంట నమోదును పరిశీలిస్తున్న వై.రామకృష్ణ

రోడ్డు నాణ్యతా లోపంపై ఎంపిడిఒ ఆగ్రహం

ప్రజాశక్తి - చాట్రాయి

చిన్నంపేటలోని అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులను ఎంపిడిఒ ఎస్.మురళీమోహన్ మంగళవారం తనిఖీ చేశారు. రోడ్ల నిర్మాణానికి వాడుతున్న సిమెంటు, ఇసుక నాణ్యతను పరిశీలించారు. తమ్మిలేరు పరివాహక ప్రాంతాలలోని అనుమతి లేని ఇసుకను రోడ్ల నిర్మాణానికి వాడుతున్నారని, నాణ్యత లేని సిమెంటును వాడుతుండటతో అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీనివాస్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. 15వ ఆర్థిక సంఘ నిధుల రిజిస్టర్, గ్రామపంచాయతీకి సంబంధించిన ఏ ఒక్క రిజిస్టరూ కనిపించకపోవడంతో కలెక్టర్‌కు, డిపిఒకు రిపోర్టు చేస్తానని తెలిపారు.

అగ్నిమాపక శాఖకు రెస్క్యూ బోట్లు, ఒబిఎంలు అందజేత

ప్రజాశక్తి - ఏలూరు

ప్రకృతి విపత్తుల సమయంలో మెరుగైన సేవలందించేందుకు రూ.12 లక్షలు విలువైన రెండు రెస్క్యూ బోట్లు, ఒక ఒబిఎంను జిల్లా అగ్నిమాపక సేవల శాఖకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అందజేశారు. స్థానిక కలెక్టరేట్లో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో విజయవాడ అమరావతి బోటింగ్ క్లబ్ నుంచి రప్పించిన రెండు రెస్క్యూ బోట్లను, ఒక ఒబిఎంను జిల్లా అగ్నిమాపక అధికారి డి.మాల్యాద్రికి కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపక అధికారి డి.మాల్యాద్రి మాట్లాడుతూ విపత్తుల సమయంలో మెరుగైన సేవలందించేందుకు రెస్క్యూ బోట్లు అందించిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ఎటువంటి విపత్తులు జరిగినా ప్రజలు తక్షణమే స్పందించి హెల్ప్ లైన్ నెంబర్ 101కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి వి.రామకృష్ణ, లీడింగ్ ఫైర్‌మెన్ రవికుమార్, డ్రైవర్ ఆపరేటర్లు ఎం.రామకృష్ణంరాజు, కె.రఘువర్మ, ఫైర్‌మెన్లు పి.ప్రశాంత్, జి.ఏసుబాబు, ఎంఎం.సత్యనారాయణ, ఎంఎస్‌వి.ప్రసాద్, డి.శ్రీనివాస్, ఎస్‌కె.అబ్దుల్ జబ్బార్ పాల్గొన్నారు.



రెస్క్యూ బోట్లను ప్రారంభిస్తున్న కలెక్టర్

సైక్లింగ్ ఆహ్లాదకరం.. ఆరోగ్యకరం

డిసిహెచ్‌ఎస్ డాక్టర్ ఎవిఆర్.మోహన్

ప్రజాశక్తి - ఏలూరు

సైక్లింగ్‌తో అద్భుత ప్రయోజనాలు ఉన్నాయని డిసిహెచ్‌ఎస్ డాక్టర్ ఎవిఆర్.మోహన్ అన్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ వారి సూచనలతో మంగళవారం స్థానిక ఇండోర్ స్టేడియం వద్ద నిర్వహించిన సైకిల్ ఫర్ హెల్త్ కార్యక్రమాన్ని డిఎంహెచ్‌ఒ డాక్టర్ నాగేశ్వరరావుతో కలిసి డిసిహెచ్‌ఎస్ డాక్టర్ ఎవిఆర్.మోహన్ జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ సైక్లింగ్ చేయడం వల్ల కండరాలు భయపడటంతోపాటు శరీర బరువు తగ్గేందుకు సహకరిస్తుందన్నారు. గుండె ఆరోగ్యానికి మంచిదని అదే విధంగా అధిక రక్తపోటు తగ్గిస్తుందన్నారు. ఒత్తిడి, మానసిక వేదనలను నియంత్రించడంతోపాటు రోగనిరోధక శక్తిని పెంచుతుందన్నారు. అన్ని వయస్సుల వారికి అనుకూల ప్రభావం చూపే వ్యాయామం సైక్లింగ్ అని అన్నారు. క్రమం తప్పకుండా సైక్లింగ్ చేయడం వల్ల మధుమేహం, ఊబకాయం, గుండె సంబంధిత సమస్యలు, వివిధ జీవనశైలి రుగ్మతలు అనేక ఆరోగ్య సమస్యలను దూరంగా ఉంచడంలో సహాయ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ నాగేశ్వరరావు, అదనపు డిఎంహెచ్‌ఒ రత్నకుమారి, సెట్‌వెల్ సిఇఒ ఎమ్‌డి.మెహరాజ్, క్రీడాశాఖాధికారి శ్రీనివాసరావు పలు విద్యాసంస్థల విద్యార్థులు, వైద్య సిబ్బంది, ఇండియన్ రెడ్‌క్రాస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



సైక్లింగ్‌లో విద్యార్థులు

వేడుకకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు మంగళవారం పెదవేగి మండలం లక్ష్మీపురంలో నూతన వస్త్రాలంకరణ వేడుకకు హాజరయ్యారు. ముసునూరు సుబ్రహ్మణ్యం, వరలక్ష్మి, కామేశ్వరి మనుమరాలు ఇషిత, మనువడు ఇషాన్ వస్త్రలంకరణ వేడుక వైభవంగా జరిగింది. దెందులూరు ఎంఎల్ఎ కొఠారు అబ్బయ్యచౌదరి దంపతులతో కలిసి వెంకయ్యనాయుడు చిన్నారులకు నూతన వస్త్రాలను బహూకరించి ఆశీర్వదించారు. చిన్నారుల తల్లిదండ్రులు గంటా శేష్‌కాంత్, సాహిత్యను ఆశీర్వదించారు. పిల్లలను క్రమశిక్షణతో, బాధ్యతతో పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. వెంకయ్యనాయుడు రాకతో పెదవేగి పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. నిర్వాహకులు ఆయనకు అడుగడుగునా పూలతో స్వాగతం పలికారు. స్థానిక ప్రముఖులను ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి పరిచయం చేశారు. ఆయిల్ పామ్ అభివృద్ధి బోర్డ్ నాయకులు కొఠారు రామచంద్రరావు వెంకయ్యనాయుడిని సత్కరించారు.




వెంకయ్యనాయుడిని సత్కరిస్తున్న కొఠారు రామచంద్రరావు

ఆసుపత్రి అభివృద్ధిని విస్మరించిన వైసిపి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

టిడిపి ప్రభుత్వ హయాంలో ఎన్నో సేవలందించిన జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో నేడు కనీస వసతులు లేకపోవడం బాధాకరమని టిడిపి రాష్ట్ర కార్యదర్శి దాసరి శ్యామ్ చంద్రశేషు అన్నారు. మంగళవారం ఆసుపత్రిలోని ఎక్స్ రే విభాగ సేవలు అందుబాటులో లేకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్యామ్ చంద్ర శేషు మాట్లాడుతూ సుమారు తొమ్మిది మండలాల్లో ఉన్న పేద ప్రజలు ఈ ఆసుపత్రి వైద్యసేవలు పొందుతున్నారని తెలిపారు. అలాంటి ఆసుపత్రిలో సిబ్బంది కొరతతో సరైన సేవలు అందక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ప్రభుత్వ కృషితో వచ్చిన ఎక్స్‌రే విభాగం నేడు సిబ్బంది లేక మూత పడిందని అసహనం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ఆసుపత్రి వైద్య సేవలపై దృష్టి పెట్టకపోవడం బాధాకరమన్నారు. అలాగే రక్త పరీక్ష విభాగంలో కూడా ఇదేరకమైన పరిస్థితి నెలకొందన్నారు. సరైన పరికరాలు, మందులు లేకపోవడం వల్ల రోగులు అవస్థలు పడుతున్నారన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ స్పందించి సిబ్బందిని నియమించాలని శేషు డిమాండ్ చేశారు.


బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

భీమడోలు విద్యార్థులకు 'కోరమండల్' పురస్కారం

ప్రజాశక్తి - భీమడోలు

కోరమండల్ సంస్థ కోరమండల్ వారి గ్రామీణ బాలికల ప్రతిభా పురస్కారానికి భీమడోలు హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పుష్పవతి తెలిపారు. ఈ మేరకు ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థినులకు రూ.ఐదు వేలు, కొండే రుతిక రూ.3,500 నగదు బహుమతి లభించాయి. సంస్థ మానవ వనరుల విభాగం ఏలూరులో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు అందజేసిందన్నారు. ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

కళాశాల బస్సులో క్షుద్ర పూజల కలకలం

ఆందోళనలో విద్యార్థులు, గ్రామస్తులు

ప్రజాశక్తి - చాట్రాయి


బస్సులో చేసిన క్షుద్రపూజలు

కృష్ణారావుపాలెంలో విస్సన్నపేటకు చెందిన ప్రయివేటు విద్యాసంస్థ విజన్ కాలేజీ బస్సులో అర్ధరాత్రి సమయంలో క్షుద్ర పూజలు కలకలం సృష్టించాయి. మంగళవారం ఉదయం విద్యార్థులు యథావిధిగా కాలేజీకి వెళ్లడానికి గ్రామంలోని పార్కింగ్ చేసిన కాలేజీ బస్సు దగ్గరకు విద్యార్థులు వెళ్లారు. అయితే ఆ బస్సులో పసుపు, కుంకుమతో పెద్దపెద్ద ముగ్గులు వేసి నిమ్మకాయలతో అన్నం ముద్దలు పెట్టి క్షుద్ర పూజలు నిర్వహించినట్లు గమనించారు. వెంటనే ఈ విషయాన్ని విద్యార్థులు తల్లిదండ్రులకు తెలపడంతో వారంతా బస్సువద్దకు చేరుకుని పరిశీలించారు. ఈ ఘటనతో వారంతా ఆందోళనకు గురయ్యారు. ఎంపిటిసి సభ్యులు చింతగుంట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్షుద్ర పూజలు నిర్వహించి గ్రామస్తుల్ని భయాందోళనకు గురి చేస్తున్న వ్యక్తులు ఎవరైనా సరే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పెదవేగి పోలీస్ స్టేషన్‌లో డిఎస్‌పి తనిఖీలు

ప్రజాశక్తి - పెదవేగి


తనిఖీలకు వచ్చిన డిఎస్‌పి అశోక్‌కుమార్

పెదవేగి పోలీస్ స్టేషన్‌ను నూజివీడు డిఎస్‌పి ఈదా అశోక్‌కుమార్ గౌడ్ మంగళవారం సాధారణ తనిఖీలు చేపట్టారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలపై సత్వరం స్పందించి, వారికి పూర్తిస్థాయిలో న్యాయం చేయాలన్నారు. నూజివీడు డివిజన్‌లో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. రేకుల షెడ్‌లో కొనసాగుతున్న పెదవేగి పోలీస్ స్టేషన్‌కు పక్కాభవన నిర్మాణ విషయం జిల్లా అధికారులకు వివరిస్తానని డిఎస్‌పి తెలిపారు.


మాట్లాడుతున్న జెవివి.రామారావు

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

ప్రజాశక్తి - దెందులూరు

ఆర్థిక అక్షరాస్యతపై చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు గోపన్నపాలెం శాఖలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు ఇచ్చే వివిధ రకాల రుణాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ జెవివి.రామారావు, రీజనల్ ఆఫీస్ ఎమ్‌డి ఇవివి.మహేశ్వరరావు మాట్లాడుతూ ఖాతాదారులు ప్రణాళికాబద్ధంగా పొదుపు ఖాతాలను నిర్వహించాలన్నారు. రిజర్వ్ బ్యాంక్ నియంతృత్వ సంస్థలు నుంచి మాత్రమే అప్పులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బ్యాంకు అధికారులు, ఖాతాదారులు పాల్గొన్నారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఘనంగా జీడిమామిడి పూతల పండుగ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని దుద్దుకూరులో డాక్టర్ వైఎస్‌ఆర్ ఉద్యానవన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'జీడిమామిడి పూతల పండుగ'ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి వారి సూచనల మేరకు కృషి విజ్ఞాన కేంద్రం, వెంకటరామన్నగూడెం వారు వ్యవసాయ డ్రోన్స్‌పై అవగాహన కల్పించారు. వైస్‌ఛాన్సలర్ డాక్టర్ టి.జానకీరామ్ జీడి మామిడి ఉత్పత్తి, నాణ్యత, పెంపకంపై మెళకువలు సూచించారు. వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై అవగాహన చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పిజి బుజ్జిబాబు, డి.కరుణశ్రీ, రాఘవేంద్రరెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వెంకట సతీష్, శాలిరాజు, దొరమామిడి, అంతర్వేదిగూడెం, సీతప్పగూడెం సర్పంచులు హాజరయ్యారు.


బంధువుల చెంతకు చేరిన నాగేంద్రబాబు(సర్కిల్లో)

నాలుగేళ్ల తర్వాత బంధువుల చెంతకు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

నాలుగేళ్ల క్రితం తప్పిపోయిన మతిస్థిమితం లేని వ్యక్తి ఆచూకీ ఎట్టకేలకు లభ్యమైంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నందాపురం గ్రామానికి చెందిన నారెం నాగేంద్రబాబు(29) నాలుగేళ్ల క్రితం క్రితం తప్పిపోయాడు. అతిన ఆచూకీ కోసం బంధువులు చాలాచోట్ల గాలించారు. పేపర్ ప్రకటన ఇచ్చినప్పటికీ ఆచూకీ లభ్యంకాలేదు. ఈ తరుణంలో విశాఖ జిల్లా అరకు దగ్గరలోని సుంకరమెట్ట గ్రామంలో ఉన్నట్లు తెలియడంతో బుట్టాయగూడెం పోలీసులు అక్కడకు వెళ్లి నాగేంద్రబాబును తీసుకొచ్చి బంధువులకు మంగళవారం అప్పగించారు.

నేడు 'సామూహిక ఎలుకల నిర్మూలన'

ప్రజాశక్తి - భీమడోలు

ఈనెల 15వ తేదీన సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టనున్నట్లు వ్యవసాయాధికారి ఉషారాణి తెలిపారు. మండల పరిధిలో 13,400 ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు జరుగుతుందన్నారు. ఈ భూముల్లో ఒకేసారి సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టేందుకు మండలానికి 70 కేజీల ఎలుకల నిర్మూలన మందు బ్రోమోడయోలిన్ మంజూరైందన్నారు. మంగళవారం పూడ్చిన ఎలుక కన్నాల్లో తిరిగి తెరుచుకొన్న వాటిని గుర్తించి, 15వ తేదీన వాటిలో వ్యవసాయ శాఖ ఉచితంగా సరఫరా చేసిన ఎలుకల నిర్మూలన మందును వేయనున్నట్లు వ్యవసాయాధికారి తెలిపారు. ఎలుకల వల్ల పంటలకు ఇబ్బంది కలగకుండా చూసేందుకు ప్రతి రైతు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

24న ఉపాధి పనుల సామాజిక తనిఖీ

ప్రజాశక్తి - భీమడోలు

మండల పరిధిలో 1921-22 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన 15వ విడత ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను ఈనెల 24వ తేదీన ఏలూరులో నిర్వహించనున్నట్లు ఎపిఒ కె.పద్మ తెలిపారు. మండల పరిధిలో రూ.11.61 కోట్ల పనులు చేపట్టామన్నారు. దీనిలో మెటీరియల్ కింద రూ.3.31 కోట్లు, వేతనాలు రూ.8.30 కోట్లు అందజేశామన్నారు. మండల పరిధిలోని 13 గ్రామపంచాయతీల్లో ఈ తనిఖీలు నిర్వహిస్తారన్నారు.

వృకాస అఖిల భారత మహాసభకు ఉమ్మడి జిల్లా ప్రతినిధులు వీరే

ప్రజాశక్తి - ఏలూరు

ఈనెల 15వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ పశ్చిమ బెంగాల్‌లో జరిగే వ్యవసాయ కార్మిక సంఘం పదో అఖిల భారత మహాసభకు ఏలూరు జిల్లా నుండి సంఘం నేతలు ఎ.రవి, పి.రామకృష్ణ, తామ ముత్యాలమ్మ, జీవరత్నం, టి.సత్యనారాయణ ప్రతినిధులుగా వెళ్లనున్నారు. పశ్చిమగోదావరి జిల్లా నుండి జె.సత్యనారాయణ, బి.జార్జి హాజరవుతున్నారు. ఈ మహాసభసభలో గడిచిన మూడేళ్ల కాలంలో సంఘం చేసిన కృషిపై సమీక్ష జరిపి వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాడేందుకు, భవిష్యత్ కార్యాచరణ తయారు చేసుకుని నూతన కమిటీని ఏర్పాటు చేస్తారని తెలిపారు.

డిగ్రీ కళాశాలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - గణపవరం

ఇంటర్ పూర్తిచేసిన ప్రతీవిద్యార్థి గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలోచేరి ప్రభుత్వం నుండి అందుతున్న సదుపాయాలు వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ పి.నిర్మలకుమారి అన్నారు. మంగళవారం డిగ్రీ కాలేజీలో చేరాలని సిబ్బంది ర్యాలీగా వెళ్లి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్‌ప్రిన్సిపల్ పి.మధురాజు, ఎన్‌విఎన్.శ్రీనివాస్, కె.స్వరూపరాణి, జి.వెంకటరావు, చిన్న సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావన ఉండాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రజలు ఆధ్యాత్మిక భావన కూడా కలిగి ఉండాలని ఏలూరు నగర శ్రీబసవేశ్వర కర్ణభక్తుల సంక్షేమ సంఘం అధ్యక్షులు సిద్ధాని నాగ సూర్యనారాయణ అన్నారు. మంగళవారం ద్వారకాతిరుమల దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులుగా నియమితులైన వాసా రామకృష్ణారావును సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలోనూ ఆధ్యాత్మిక భావన పెంపొందినప్పుడే సమాజంలో శాంతి, సౌఖ్యాలు నెలకొంటాయని తెలిపారు. రామకృష్ణారావు ప్రతిష్టాత్మక ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులుగా నియమితులు కావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర బసవేశ్వర కర్ణభక్తుల సంక్షేమ సంఘం కార్యదర్శి శలా నాగతిరుమలేశ్వరరావు(ప్రకాష్), కోశాధికారి తమ్మా శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు తమ్మా గణపతి, సిద్ధాని ప్రసాద్, జంగారెడ్డిగూడెం కర్ణభక్త సంక్షేమ సంఘం అధ్యక్షులు సిద్ధాని నాగ సూర్యనారాయణ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు వ్యవసాయేతర భూములుగా మార్చాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చేక్రమంలో రెవెన్యూ అధికారులు తప్పనిసరిగా మార్గదర్శకాలను అమలు చేయాలని నూజివీడు డివిజన్ ఇన్‌ఛార్జి సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని బొద్దనపల్లి, పోతవరప్పాడు, మల్లిబోయినపల్లి గ్రామాల్లోని నాలా కోసం దరఖాస్తు చేసుకున్న భూములను పరిశీలించారు. అనంతరం రాజవరంలోని సీనియర్ సిటిజన్ దరఖాస్తు చేసుకొన్న సమస్యపై విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.ఉదయభాస్కరరావు, రమణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - చింతలపూడి

ద్విచక్రవాహనదారులు తప్పనిసరి హెల్మెట్ వినియోగించాలని ఎస్ఐ డి.హరికృష్ణ సూచించారు. మంగళవారం చింతలపూడి జహీర్ మోటార్స్‌లో హీరో జూమ్ స్కూటర్‌ను ఎస్ఐ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జహీర్ మోటార్స్ అధినేత ఎస్‌డి ఖాజా మొహిద్దీన్, టూ వీలర్స్ అసోసియేషన్ నాయకులు డి.రామకృష్ణ, జి.రాజేష్ నాయుడు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు అజాద్ పాల్గొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై దాడి దారుణం

ప్రజాశక్తి - ఏలూరు

ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై దాడులు, నిర్బంధాలు దారుణమని యూనియన్ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో కె.లెనిన్ మాట్లాడారు. మచిలీపట్నంలోని కృష్ణా యూనివర్సిటీలో సమస్యలను పరిష్కరించాలంటూ వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన ఎస్‌ఎఫ్‌ఐ నాయకులపై పోలీసులతో ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి పవన్‌ను పోలీసులు ఈడ్చుకుంటూ లాక్కెళ్లడం దారుణమన్నారు. వారు పోలీసులా లేక ప్రభుత్వానికి బానిసలుగా పనిచేస్తున్న గుండాలా అని ప్రశ్నించారు. గత కొద్దిరోజులుగా విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ గానీ, అధికారులు గానీ సరిగా పట్టించుకున్న పరిస్థితి లేదన్నారు. ఈ యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులకు సరైన సదుపాయాల్లేక అవస్థలు పడుతున్నారన్నారు. విద్యార్థులకు సరైన సౌకర్యాలు, ప్రభుత్వ హాస్టల్ లేక అదే యూనివర్సిటీలో ఉన్న క్యాంపస్‌లో అద్దె గదుల్లో నివసిస్తున్న విద్యార్థులకు విద్యుత్ షాక్ కొట్టడంతో విద్యార్థులు ఆసుపత్రి పాలయ్యారన్నారు. వెంటనే విసిని బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలపైన ఎస్‌ఎఫ్‌ఐ సామరస్యంగా ఆందోళన చేపడుతుంటే పోలీసులు పవన్‌పై దాడి చేయడంతో అతను నెలరోజుల పాటు ఆసుపత్రిలో ఉన్నాడని, ఈ క్రమంలో అత్యవసరమై మెరుగైన వైద్యం కోసం ఇతర ఆసుపత్రికి తరలించేందుకు 108కి ఫోన్ చేస్తే అరగంట పాటు వాహనాన్ని లోపలికి రాకుండా అడ్డుకున్నారని, పవన్‌కు ఏదైనా జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పట్టణ నాయకులు సాయి, రాజేష్, రాకేష్, వంశీ, తరుణ్ పాల్గొన్నారు.

సిపిఎం నేత రాజేష్‌కు పితృవియోగం

ప్రజాశక్తి - మండవల్లి


నివాళులర్పిస్తున్న నాయకులు

సిపిఎం కృష్ణాజిల్లా నేత మురాల రాజేష్ తండ్రి మురాల భిక్షం(55) సోమవారం రాత్రి ఉనికిలిలోని ఆయన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన పార్టీలో విశేష సేవలందించారు. ప్రస్తుతం ఆయన కుమారుడు రాజేష్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. సమాచారం అందుకున్న సిపిఎం నాయకులు మంగళవారం ఉదయం ఉనికిలి చేరుకుని మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్.రఘు మాట్లాడుతూ ఉద్యమ భావాలు కలిగిన రాజేష్‌ని పార్టీకి అందించిన గొప్ప వ్యక్తి భిక్షాలు అని అన్నారు. ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొనే రాజేష్‌కు కుటుంబ సభ్యులతో పాటు తండ్రి సహాయ సహకారాలు మెండుగా ఉండేవన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన వీరు ఉద్యమాల్లో పాల్గొని పేదల సమస్యలపై నిరంతరం పోరాడారన్నారు. భిక్షం కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కళా వెంకట్రావు, వై.నరసింహారావు, శివ నాగేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వై.మధు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సిపి రెడ్డి, టివి.లక్ష్మణస్వామి, ఫౌండ్రీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వరరావు, సిపిఎం ఉయ్యూరు పట్టణ కార్యదర్శి బి.రాజేష్, ఉంగుటూరు మండల కార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు, గన్నవరం కార్యదర్శి ఎం.ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్ బాది, బాపులపాడు మండలం కార్యదర్శి శ్రీనివాసరావు, గుడ్లవల్లేరు మండల బాధ్యులు బివి.శ్రీనివాసరావు, ఇసుక ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు పి.ప్రభుదాస్, గుడివాడ పట్టణ ఐద్వా అధ్యక్షులు పి.వీరమ్మ, పార్టీ పట్టణ కమిటీ సభ్యులు బసవ అరుణ, పి.రజిని, ఐద్వా జిల్లా కార్యదర్శి బి.జ్యోతి, సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు రబ్బాని కొండ, నాయకులు, కార్యకర్తలు భిక్షం పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

శరవేగంగా 30 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు

రూ.2.5 కోట్లతో మెరుగులు - పరిశీలించిన ఎంఎల్ఎ అబ్బయ్య చౌదరి

ప్రజాశక్తి - దెందులూరు


ఆసుపత్రి పనులను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ

త్వరలోనే దెందులూరు పరిసర ప్రాంతాల ప్రజలకు సామాజిక ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి తీసుకు రానున్నట్లు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి తెలిపారు. దెందులూరు గ్రామంలో రెండున్నర కోట్ల రూపాయల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను ఎమ్మెల్యే మంగళవారం స్థానిక వైద్యాధికారులతో కలిసి పరిశీలించారు. నూతనంగా ఏర్పాటు చేసిన సామాజిక ఆరోగ్య కేంద్రానికి అవసరమైన వైద్య పరికరాల అవసరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కొఠారు మాట్లాడుతూ దెందులూరు పరిసరాల్లోని 12 గ్రామాలకు సంబంధించిన ప్రజలకు అత్యాధునిక పరికరాలతో మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో సుమారు రెండున్నర కోట్ల రూపాయల వ్యయంతో సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మించడంతోపాటు అత్యాధునిక వైద్య సేవలు ప్రజలకు అందించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేశామని ఆయన వెల్లడించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్య సేవలు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, వైసిపి నేతలు జానంపేట బాబు, పోకల రాంబాబు, మాజీ సర్పంచి తొత్తడి వేదకుమారి, వైస్ ఎంపిపి వేమూరి జితేంద్ర, సహకార బ్యాంకు అధ్యక్షులు కొలుసు గణపతి, ఎంపిటిసి తాళ్లూరి నాగరాజు పాల్గొన్నారు.

వైసిపిని గద్దెదించాలి : టిడిపి

ప్రజాశక్తి - చింతలపూడి

వైసిపి ప్రభుత్వాన్ని గద్దెదించే వరకూ కార్యకర్తలు, నాయకులు అవిశ్రాంతంగా పనిచేయాలని ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి, చింతలపూడి మండల టిడిపి అధ్యక్షులు మాటూరి వెంకటరామయ్య పిలుపునిచ్చారు. మండలంలోని ఉర్లగూడెం పంచాయతీలోనీ కనిపెడ గ్రామంలో ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం పార్టీ గ్రామ అధ్యక్షులు బాల శ్రీనివాసరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు నందిపాం నాగేశ్వరరావు, నాయకులు ముసునూరు ప్రసాద్, ఉల్లాస సుబ్బారావు, రాధాకృష్ణ, ఆదియ, రమేష్, వెంపాటి సత్యనారాయణ, బొల్లిన పరమేష్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు రోడ్లకు మరమ్మతులు

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు పట్టణ పరిధిలోని అంతర్గత రహదారుల గోతులను పూడ్చేందుకు ఎట్టకేలకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు మరమ్మతులు చేయాలని మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ ఈ మేరకు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మునిసిపల్ కౌన్సిల్ ఆమోదంతో రూ.1.20 లక్షల బడ్జెట్ కేటాయించి పట్టణంలో ఉన్న 32 వార్డుల్లో అంతర్గత రహదారుల గోతులను సరిచేస్తున్నట్లు చెప్పారు.


ఒరిజినల్ లింకు దస్తావేజులు పోయినవి

కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం, బాపులపాడు గ్రామం, గుడివాడ రోడ్డు, డోర్ నెం.9-10రు కాపురస్తురాలు నరికిమిల్లి సత్యనారాయణగారి భార్య నరికిమిల్లి నాగలక్ష్మి కుమారి వయస్సు 54 సం॥లు పై అడ్రస్‌లో నివాసముంటున్న నేను ది.15-2-2017వ తేదీన దబ్బాడ వెంకటమ్మ గారి వలన పెదపాడు మండలం, ఏపూరు గ్రామ రీ.స. 242-4 రు దాఖలా చ.గ. 193.6 ల నివేశన స్థలము, అందుగల డోర్ నెం.9-11 ఆర్.సి.సి. భవనము వగైరాల సహా కొనుగోలు చేసుకొని నా పేరున శ్రీ వట్లూరు స.రి.లో ద.నెం. 273/2017 రుగా రిజిష్ట్రీ పొంది అట్టి ఆస్తి నేటి వరకు నా స్వాధీన హక్కుభుక్తములలో వుండియున్నది. నా దస్తావేజుకు లింకు దస్తావేజు నెం. 3349/2010 రును, అట్టి దస్తావేజుకు లింకు దస్తావేజు నెం.7957/2006రు మరియు, సదరు నెం. 7857/2006రుకు లింకు దస్తావేజు 836రుగా నాకు అందజేయటం జరిగియున్నది. అట్టి 7957/2006, 836రుగా గల లింకు దస్తావేజులను ది. 11-02-2023వ తేదీన ఒక కవరులో పెట్టుకొని జిరాక్స్ తీయించుకొనుటకు ఏలూరురోడ్డులో వున్న జిరాక్స్ సాపు వద్దకు వెళ్ళి చూసుకొనగా కవర్‌లో పెట్టుకొన్న దస్తావేజు ఎక్కడో జారిపడిపోయినది. నేను వచ్చిన మార్గములో ఎంత వెదికినా, అక్కడున్నవారిని అడిగినా నా ఒరిజినల్ లింకు దస్తావేజు కనిపించలేదు. సదరు ఒరిజినల్ రెండు లింకు దస్తావేజులు నెం. 7957/2006, 836 ఎవరికైనా దొరికిన యెడల క్రింది అడ్రస్‌కు తెలియజేయగలరని కోరుతున్నాను.

ఇట్లు
నరికిమిల్లి నాగలక్ష్మి కుమారి,
భర్త : నరికిమిల్లి సత్యనారాయణ, డోర్ నెం.9-10రు
బాపులపాడు గ్రామం, గుడివాడ రోడ్డు,
బాపులపాడు మండలం, కృష్ణాజిల్లా,

సైక్లింగ్‌తో మంచి ఆరోగ్యం

ప్రజాశక్తి - భీమడోలు


భీమడోలులో సైకిల్‌ర్యాలీ

ఆరోగ్య పరిరక్షణలో వ్యాయామం కీలకపాత్ర వహిస్తుందని, దీనిలో సైక్లింగ్ ఒకటని భీమడోలు పిహెచ్‌సి వైద్యాధికారి వై.నాగమల్లి తెలిపారు. ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా సైకిల్ ఫర్ హెల్త్ కార్యక్రమాన్ని మంగళవారం భీమడోలులో నిర్వహించారు. ఈ సందర్భంగా వై.నాగమల్లి మాట్లాడారు. అనంతరం కార్యాలయ సిబ్బంది భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థుల భాగస్వామ్యంతో భీమడోలు పురవీధుల్లో సైకిల్ ఫర్ హెల్త్ నినాదాలతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మానస హైస్కూల్ ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్, కార్యాలయ సిబ్బంది మురళీ, సుజని, చంద్రకళ పాల్గొన్నారు.

చింతలపూడి : సైకిల్ తొక్కడం, నడక మంచి ఆరోగ్యాన్నిస్తాయని పిహెచ్‌సి వైద్యాధికారులు సయ్యద్ జఫ్రుల్లా, కె.దిలీప్ అన్నారు. చింతలపూడి-3 సచివాలయ పరిధిలోని ఎన్‌ఎస్‌పి కాలనీలో మంగళవారం వైఎస్‌ఆర్‌హెల్త్ క్లినిక్‌లో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రోగులకు మధుమేహం, జ్వరం, రక్తపోటు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో హెల్త్ సెక్రటరీ విజయనిర్మల, ఆశావర్కర్లు శ్యామల, పుణ్యవతి, నాగమణి పాల్గొన్నారు.

గణపవరం: నిత్యం సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి ఎంతో మంచిదని స్థానిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పి.సంతోషనాయుడు. పి.కిరిణ్మయి అన్నారు. గణపవరంలో జరిగిన ఆరోగ్య మేళాలో వారు మాట్లాడారు. సైకిల్ తొక్కడం వల్ల కండరాలు గట్టిపడతాయన్నారు. అధిక రక్తపోటు తగ్గించి మానసిక ఒత్తిళ్లను అధికమించొచ్చన్నారు. మండలంలో ప్రతీ ఆరోగ్య ఉపకేంద్రంవద్ద ఆయుష్మాన్ భారత్ హెల్త్‌అండ్ వెల్‌నెస్ సెంటర్లలో ప్రతినెల 14వ తేదీన గర్భిణులకు సేవలు అందిస్తామని చెప్పారు. వీరితో పాటు మధుమేహం, రక్తపోటు పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా చేపట్టిన ర్యాలీ ప్రధాన రహదారుల్లో సాగింది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు జే.విల్సన్‌బాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు
గుడివాడ
ఓ.యస్. నెం. 351/2016

బీట్విన్:
శాయిన రామ్మోహనరావు మరియు 5 ఇతరులు - వాదులు
మరియు
1. పల్నాటి రాజరావు మరియు 17 ఇతరులు
17) దోస శ్రీనివాసరావు, తండ్రి దామోదరరావు, హౌసింగ్ బోర్డ్ కాలనీ, రిటైర్డ్ సి.ఐ.గారి ఇల్లు, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా.
18). దోస శాంతరామ్, తండ్రి దామోదరరావు, పంచాయతీ ఆఫీసు ప్రక్కన, వల్లంపర్రు గ్రామం, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.
-ప్రతివాదులు

పై నెంబరు దావాలో శ్రీకోర్టు వారు ప్రతివాది 17 మరియు 18 వార్లకు నోటీసులు పేపరు ప్రకటన ద్వారా అమలు చేయుటకు శ్రీకోర్టు వారు ఉత్తర్వులను జారీ చేసి ప్రతివాది 17 మరియు 18 వార్లు హాజరగుటకు దావాని ది. 01-03-2023వ తేదికి వాయిదా వేసియున్నారు. సదరు తేదిన ప్రతివాది 17 మరియు 18 వార్లు స్వయంగా గాని, వారి అడ్వకేట్ గాని ద్వారా గాని ఉదయం 10.30 ని॥లకు పైకోర్టులో పై తేదిన హాజరు కావలెను. అట్లు హాజరు కాని ఎడల పై నెంబరు గల దావాని ప్రతివాది 17 మరియు 18 వార్ల పరోక్షమందు వారికి వ్యతిరేకంగా తీర్మానించబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీకోర్టు వారి ఆర్డరు ప్రకారం)
గుడివాడ
తేది 13-02-2023
ఎస్. వి.పాండురంగారావు
అడ్వకేట్, గుడివాడ

125 మందికి ఉచిత దంత పరీక్షలు

నూజివీడు: మండలంలోని మొర్సపూడిలో గన్నవరం మండలం చిన్న ఆవుటపల్లికి చెందిన డాక్టర్ సుధా నాగేశ్వరరావు సిద్ధార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్సెస్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 125 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పిఆర్ఒ టి.నాగేశ్వరరావు, గ్రామ సర్పంచి వడ్డాది లక్ష్మి, గ్రామ ప్రముఖులు వడ్డాది త్రినాధరావు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, కైకలూరు, ఏలూరు జిల్లా
C.C. No. 25/2019

Between:
కొప్పోజు వరలక్ష్మి ...*Complainant*
మరియు
మేకా వాసు ...*Accured*

కంప్లయింట్ దాఖలు చేసిన పబ్లికేషన్

పై నెంబరు గల కేసులో ముద్దాయి అయిన మేకా వాసు, S/o. సత్యనారాయణ, డోరు నెం. 8-120/1, న్యూ అశోక్ నగర్, గౌరవరం, 3rd Town, 5th Road, శనివారపుపేట, ఏలూరు, ఏలూరు జిల్లా వారికి పై కోర్టు వారి ఎదుట **ది. 22-2-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తెలియపరచు కొనవచ్చును. లేనిఎడల కేసు తమ పరోక్షముగా విచారణ జరుగును అని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

ముంతా సతీష్, అడ్వకేట్
ఏలూరు, ఏలూరు జిల్లా
సెల్: 95333 62629

PUBLIC NOTICE
In the Court of the Additional Senior Civil Judge, Eluru
I.A. No. 193/2022
in
H.M.O.P. No. 151/2021

Between:
Smt. Pasam @ Sanku Krishnaveni ...*Petitioner/ Respondent*
AND
Pasam Veerendra Kumar ...*Respondent/ Petitioner*

Whereas, the petitioner filed petition to set aside the ex-parte order dated 05-01-2022 passed against the petitioner, whereas, the Hon'ble Court was pleased to order notice to you. Therefore, you are informed to appear before the Hon'ble Court **on 20-02-2023 at 10.30 A.M** and state your objections if any, else the matter will be decided according to Law.

PYDI VENKATA RAJU
Advocate, Eluru
Cell: 98851 99811

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జి, ఏలూరు
I.A. 882/2022, O.S. 477/2014

బిట్వీన్:
మెట్టపల్లి సాంబమూర్తి **-పిటీషనర్/వాది**
మరియు
కంతా రామారావు, వగయిరా
-రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

పిటీషనరు దాఖలు చేసిన పబ్లికేషన్

పై నంబరు గల పిటీషన్‌లో 13వ రెస్పాండెంటు అయిన బవిరిశెట్టి రవికుమార్, S/o. నాగేశ్వరరావు, డోరు నెం. 9-328, సాయిబాబా గుడి దగ్గర, చింతలపూడి, ఏలూరు జిల్లా వారికి పై కోర్టులో **ది. 21-2-2023వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** స్వయంగా గాని లేదా ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి తమ ఆక్షేపణలు తెలియపర్చుకొనవచ్చును. లేని ఎడల సదరు పిటీషన్ ఏకపక్షముగా తీర్మానము చేయుదురని యిందుమూలముగా తెలియచేయడమైనది.

ఆవుల జగన్మోహనరావు
పుప్పాల రామకృష్ణ
అడ్వకేట్స్, శ్రీరామ నివాస్
ఏలూరు అశోక్‌నగర్, ఏలూరు
ది.14-2-23 ఏలూరు జిల్లా

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు
E.P.No. 64/2021
AACFNo. 143/2019

Between:
కపిల్ చిట్స్ (కోస్తా) ప్రై.లిమిటెడ్
ఏలూరు బ్రాంచ్
-DHR
మరియు
కొయ్యగర్ల సజ్జనరాజు వగైరాలు
-JDRs

6th JDR అడ్రస్ : పెర్లి ఇమ్మానియేలు, తండ్రి సముద్రాలు కెహెచ్ హెల్పర్, ఎంప్లాయి నెం. 244ఐజి100081, ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ఎస్‌సి రైల్వే నిడదవోలు, ఆర్/ఓ క్వా.నెం. 50/6ఎ రైల్వే క్వార్టర్స్, ఏలూరు రైల్వే స్టేషన్ వద్ద, ఏలూరు

పై గ్రంథంలో పై పేర్కొన్న 6వ JDR కోర్టు వారి నోటీసు తీసుకొనుటలో జాప్యం చేస్తున్నందున, కోర్టు వారి ఆదేశానుసారం ఈ ప్రకటన జారీ చేయడమైనది.

పై పేర్కొన్న 6వ JDR పై కోర్టువారి ఎదుట ది. 22-2-2023వ తేదిన ఉదయం 10-30 గంటలకు హాజరై తగురీతిలో సంజాయిషీ యిచ్చుకోవలెను లేదా అడ్వకేట్ ద్వారా నైనా హాజరు కావచ్చు, అట్లు హాజరు కాని ఎడల మీ పరోక్షంలో కోర్టువారు విచారణ గాలించి తగురీతిలో ఆర్డర్స్ పాస్ చేయుదురని యిందుమూలంగా తెలియపర్చడమైనది.

ఇట్లు,
ఎన్.వి. సత్యనారాయణ (ఎన్‌వియస్)
అడ్వకేట్
ఏలూరు, సెల్ నెం. 9440376655
ఏలూరు,
2-2-2023